క్లుప్తంగా

క్రికెట్ కిట్ అందజేత

కల్వకుర్తిరూరల్: క్రీడలపై యువకులు ఆసక్తి పెంచుకోవాలని ఐక్యతా ఫౌండేషన్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ఈదమ్మ తల్లి యువకులకు క్రికెట్ కిట్ ఆయన అందజేశారు. క్రీడలపట్ల ఐక్యతా ఫౌండేషన్ అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు క్రీడాకారులకు సహకారం అందిస్తామని చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో యువకులు రాజ, శ్రీనివాస్, రాము, సాయి, శేఖర్, సత్యం, రాఘవేందర్, గణేశ్, శ్రీపతిరాజు, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక సందర్శన



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి ఉన్నత పాఠశాలను డీఈఓ గోవిందరాజులు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం తిరుపతయ్య, పాఠశాల హెచ్‌ఎం గోవింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, శ్రీనివాసాచారి తదితరులు ఉన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

ఊర్కొండ: మన ఊరు–మన బడి పనులను త్వరగా పూర్తిచేయాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. మంగళవారం మండలంలోని రేవల్లి, ఊర్కొండలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ బాసునాయక్ ఉన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



తెలకపల్లి: పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు సహకారం అందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు సహకారం అందించాలని మంగళవారం పాఠశాలలో సమావేశమయ్యారు. పాఠశాలలో గ్రంథాలయ ఏర్పాటుకోసం రూ.22వేల విలువ గల ఫర్నీచర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బాలస్వామి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు స్పందించి పాఠశాల బలోపేతానికి, గ్రంథాలయ అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేందర్‌రెడ్డి, ఆంజనేయులు, సురేశ్, రాముడు, ఓనమాల్‌రెడ్డి, మల్లేశ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్ కి చెందిన యాదయ్య ఇటీవల మృతిచెందాడు. మంగళవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని నారాయణపూర్‌లో నేనావత్ రాంజ్యానాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం శివయూత్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.12వేల ఆర్థికసాయం అందజేశారు.

ఉత్సవాలు ప్రారంభం

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామపంచాయతీ పరిధిలో రామగిరిలో వెలసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు వేకువజామున పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పదరకు చెందిన ఆవుల కృష్ణయ్య అమ్రాబాద్ నుంచి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా మల్లెపల్లికి చెందిన కొంత మంది మద్దిమడుగు ఆంజనేయస్వామిని దర్శించుకొని ఆటోలో వెళ్తున్న క్రమంలో కుమ్మరోనిపల్లి గ్రామ సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కృష్ణయ్య కాలువిరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో జిరాక్స్ షాపులో మంటలు

వెల్దండ: మండల కేంద్రంలో పశువైద్యశాల సమీపంలో ఎంజీ తండాకు చెందిన ప్రవీణ్‌నాయక్ నిర్వహిస్తున్న జిరాక్స్ షాపులో మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వచ్చాయి. సమయానికి షాపు యాజమాని రావడంతో వెంటనే నీరు పోసి మంటలను ఆర్పారు. దాదాపుగా రూ.20వేల నష్టం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



ఈదమ్మ దేవతకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని 1, 17 వ వార్డులలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. విద్యుత్, తాగునీరు, వంటగ్యాస్ సరఫరాల అంశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాజయ్యకు సూచించారు. ఆయన వెంట నాయకులు చంద్రశేఖరాచారి, నరేందర్‌రెడ్డి, గాలియాదవ్, పరశురాంగౌడ్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, మహేష్, రాజుయాదవ్, నర్సింహ తదితరులున్నారు.

పలువురి వినతి పత్రాలు...

వాల్మీకీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఈ మేరకు అసెంబ్లీలో వాల్మీకీ బోయల సమస్యలపై చర్చించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తెలుగు కులస్తులను బీసీ(ఏ) జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. దళిత జర్నలిస్టులకు దళితబంధు పథకం యూనిట్లు మంజూరు చేయాలని కోరుతూ దళిత జర్నలిస్టు ఫోరం నాయకులు వినతి అందజేశారు.

పీఆర్‌టీయూ డైరీల ఆవిష్కరణ..

పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం డైరీలను మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘం నాయకులు రాంచందర్‌రావు, రంగినేని కృష్ణ, అర్జున్‌గౌడ్, శ్రీకాంత్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం

కొల్లాపూర్: పట్టణంలో ఐదు మంగళవారాల పాటు సాగే ఈదమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈదమ్మ దేవతకు సర్కారీ బోనాన్ని తొలిబోనంగా సమర్పించారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఈదమ్మ దేవతను దర్శించుకుని, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల నిర్వహణను వరిదేల, కొల్లాపూర్ రైతు సంఘాల నాయకులు పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మెన్ కిషన్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, నాయకులు చంద్రశేఖరాచారి, నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, రాముడుయాదవ్, సాకలి నర్సింహ్మ, స్వామిరెడ్డి, పెద్దూరి లక్ష్మయ్య, బిజ్జవేణు, గుగ్గిళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదాం



మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: ప్రజలంతా గ్రామ అభివృద్ధి కోసం కలిసి వస్తే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెల్గొండలో మర్రి జనార్దన్‌రెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన ఆయనకు రెండు పడకల ఇళ్లు, పింఛన్లు, రైతుబంధు వంటి సమస్యలు దృష్టికి వచ్చాయి. అలాగే గ్రామంలో మురుగు కాల్వలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రతి సమస్యను తన వంతుగా పరిష్కరిస్తానని, అందుకు సంబంధించి లబ్ధిదారుల నుంచి ఆధార్‌కార్డులను తీసుకున్నారు. గ్రామంలో పొలాల బాటల సమస్యను తన సొంత ఖర్చుల పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుర్వమ్మ, నాయకులు నాగిరెడ్డి, రామ లక్ష్మణ్, సూర్యశేఖర్ రెడ్డి, రాంరెడ్డి, కొండయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతూన్న ఏడీఏ రవి

కొల్లాపూర్ రూరల్: చిరుధాన్యాలు సాగు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏడీఏ రవి ప్రజలకు, రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్లూరు రైతువేదికలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–023 సందర్భంగా రైతులతో మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రవి మాట్లాడుతూ చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు. చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, కొర్ర, రాగి, అరికలు, సాములు, ఊదలు, అండుకొర్రలు, తృణ ధాన్యాలు ఆరోగ్యాన్ని కాపాడుతాయన్నారు. మధుమేహం, గుండెజబ్బులు, రక్తపోటు, క్యాన్సర్, ఆస్తమా, అధిక బరువు నియంత్రణకు చిరుధాన్యాలు మేలు చేస్తాయన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లభాలను ఆర్జించవచ్చు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, నాగరాజు, శ్రీరామ్, రమేష్, డివిజన్ ఏఈఓలు, ఎంపీటీసీ మంజూల, రైతు బంధు సమితి కోఆర్డినేటర్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి



ఐతోల్‌లో వననర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నర్సింగరావు

తాడూరు: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచి ప్రతి కూలికి పని కల్పించాలని డీఆర్‌డీఓ నర్సింగరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఐతోల్‌లో వననర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి పని కల్పించి గ్రామపంచాయతీల వారిగా 50 కూలీలకు తక్కువ కాకుండా పని చేసే విధంగా ఉపాధి హామీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్కలు రక్షించాలన్నారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఆయా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండే మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గంగమోహన్, ఏపీఓ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా 'కంటి వెలుగు' పరీక్షలు



ఐతోల్‌లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తాడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవీ, జెడ్పీటీసీ సభ్యురాలు రోహిణి అన్నారు. మంగళవారం మండలంలోని ఐతోల్‌లో కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరాం మాట్లాడుతూ తాడూరు, ఐతోలులలో 315 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు.

లింగాల: లింగాల సీహెచ్‌సీలో ఇప్పటి వరకు 900లకు పైగా మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి బిక్కునాయక్ తెలిపారు. అంబట్‌పల్లి పీహెచ్‌సీలో 1,000 మంది వరకు కంటి పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి సంతోష్ తెలిపారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం దోమలపెంటలోని గ్రామ పంచాయితీ ఆవరణలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ శారద ప్రారంభించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగింది. డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ నీటిని తాగాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తెలకపల్లి: మిషన్ భగీరథ నీటిని తాగాలని మిషన్ భగీరథ ఇన్‌చార్జ్ ఏఈ వాటర్ క్వాలిటీ కౌన్సెలెంట్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద మిషన్ భగీరథ నీటిపై ఆర్‌డబ్ల్యూఎస్, భగీరథ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ద్వార ఫిల్టర్ అయిన నీటిని, బోరు నీటిని పరీక్షించి ప్రజలకు అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైందన్నారు. ఫిల్టర్, బోరు నీటిని వాడరాదని, మిషన్ భగీరథ నీరు వాడాలన్నారు. దీంతో ఎలాంటి వ్యాధులు ప్రభలవని సూచించారు. ఈ నీటిలో ఖనిజాలు, లవణాల, ఫ్లోరైడ్, తదితర అంశాలు సూచించిన మోతాదులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్ సురేఖ, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్

కల్వకుర్తిరూరల్: డివిజన్ పరిధిలోని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కల్వకుర్తిలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు నేతాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాలుకా కమిటీకి ఎన్నికలు నిర్వహించగా రవికుమార్ భారీ మెజారిటీతో విజయం సాధించినట్లు నేతాజీ తెలిపారు కార్యక్రమంలో పురుషోత్తం, చెన్నకేశవులు, శ్రీనివాసులు, సాధిక్, తన్వీర్, వంశీకృష్ణ, గౌస్, ఫయాజ్, యాదగిరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అధికారం ఉందనే నేపథ్యంతో స్థాయి మరిచి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతిని విమర్శించడం తగదని, 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీ పార్కు వద్ద ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు కుమార్ మాట్లాడుతూ జాతీయ నాయకురాలు మాయావతి ఎంతో త్యాగం, నిబద్ధతతో బహుజన సమాజం కోసం పనిచేసిన సంగతి మరిచిపోవద్దన్నారు. అవాకులు, చెవాకులు మాట్లాడుతున్న గువ్వలను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు రాములమ్మ, యూసూఫ్, అంతటి నాగన్న, బ్రహ్మయ్య, రామచంద్రం, కృష్ణయ్య, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'హాత్ సే హాత్ జోడో'

చారకొండ: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా చేపడుతున్న హాత్ సే హాత్ జోడో యాత్రలో డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలు, పనితీరును ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ప్రజలకు సంక్షేమం కాంగ్రెస్‌తోనే అందుతుందని అన్నారు. కార్యక్రమంలో అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, నాయకులు శంకర్, శ్రీను ఉన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

ఉప్పునుంతల: నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెడితే మొక్కలు ఆశించిన స్థాయిలో ఎదుగుతాయని ఎంపీడీఓ లక్ష్మణ్ రావు సూచించారు. మంగళవారం మండలంలోని దేవదారికుంట తండాలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీడీఓ సందర్శించి వైద్య సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ బుక్ కీపర్లు, వైద్య సిబ్బ సిబ్బంది, ఆశల కార్యకర్తలు కంటివెలుగు టార్గెట్ పూర్తి చేయడానికి కృషిచేయాలని చెప్పారు. ఎంపీడీఓతోపాటు ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

మొక్కలకు నాణ్యమైన మట్టి అవసరం

బిజినేపల్లి: హరితహారం మొక్కలు ఆరోగ్యకరంగా పెరగడానికి నాణ్యమైన మట్టిని ఎంపిక చేయాలని డీఆర్‌డీఓ నర్సింగరావు అన్నారు. మంగళవారం తిమ్మాజీపేట మండలంలోని మారేపల్లి, నేరెళ్లపల్లిలలోని వన నర్సరీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎండీపీఓ కరుణశ్రీ ఉన్నారు.

'ఆదానీ' కంపెనీలపై విచారణ జరపాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంస్థలను కాపాడడంలో పూర్తిగా విఫలం చెందిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహా ఆరోపించారు. ఆదానీ గ్రూప్ కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, ఎస్‌ఎండీ ఫయాజ్, కేశవులు గౌడ్, కార్యవర్గ సభ్యులు నర్సింహ, విజయుడు, ఏసయ్య, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు ఇందిరమ్మ, కృష్ణాజీ, సూర్యశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామ్మోహన్

మన్ననూర్: ప్రభుత్వం గ్రామీణ కూలీలకు కల్పిస్తున్న ఉపాధి హామీ పనులను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అమ్రాబాద్ ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో 66 మందితో ఉపాధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూలీలకు ఆయన పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒకరూ వంద రోజుల ఉపాధి పనులను ఉపయోగించుకోవాలని అన్నారు. అర్హులకు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో జాబ్‌కార్డు ఇచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి రోజు కూలీల హాజరు ఎన్‌ఎంఎంఎస్ ద్వారా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కూలీలకు వారం వారం కూలీ డబ్బులు అందేవిధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ తెలియజేశారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఐకేపీ వీఓఏలు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర నాయకుడు రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయ అధికారి వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలను చైతన్యవంతం చేస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునందిస్తూ పనిచేస్తున్న వీఓఏలను రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా హింసిస్తుందని ఆరోపించారు. ఎన్నికల ఎదుట హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి ఎన్నికల అనంతరం వారికి వేతనాలు పెంచడంలో విఫలం చెందుతున్నారని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించినా అవేవీ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మిక చట్టాల సవరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ లాంటి నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వీఓఏలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు పర్వతాలు, సహాయ కార్యదర్శి రామయ్య, కోశాధికారి కొంపల్లి అశోక్, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షులు సుమలత, నాయకులు దామోదర చారీ, సుమతి, అంజన్న, మహిపాల్, మల్లేశ్, అనితా భేగం, ఖాజాబీ, రామస్వామి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వాలీబాల్ విజేత 'నాగర్‌కర్నూల్'



ఛాంపియన్‌గా నిలిచిన నాగర్‌కర్నూల్ జట్టు

కందనూలు: జనవరి 29, 30 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకుల మండలం రాచాలలో శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలికలు, బాలుర వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గద్వాల, నారాయణపేట, వనపర్తి, మహబుబ్‌నగర్ బాలబాలిక జట్టు పాల్గొనగా నాగర్ కర్నూల్ జిల్లా బాలురు జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ మేరకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్, ప్రధాన కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్, సత్యం, సత్యనారాయణ, ట్రెజరర్ నరేందర్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

ఆలయాల్లో పూజలు

లింగాల: కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ దేవాలయాలలో పూజలు చేసుకోవాలని ఏఎస్‌ఐ శ్రీనివాసులు, ఎమ్మార్వై సీతారాంనాయక్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అంబట్‌పల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజలు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బీసీలకు అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న బూరుగుపల్లి శ్రీనివాస్ యాదవ్

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని బీసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 6న రాష్ట్రం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో బీసీలకు జనాభా దమాషా ప్రకారం రూ.50 వేల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం కూడా అదే తరహాలో నిధులు కేటాయించాలని 2017–18 ఆర్థిక సంవత్సరంలో రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ యువతకు వందశాతం రాయితీ రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని, మహిళా ప్రజాప్రతినిధులపై రాష్ట్ర గవర్నర్‌పై అసభ్య పదజాలంతో ఉపయోగించిన ప్రజాప్రతినిధులను పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పిడికిళ్ల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేశ్ గౌడ్, యువసేనా అధ్యక్షుడు మేశ లక్ష్మయ్య, నియోజకవర్గ నాయకులు కొట్ర శ్రీను, ఆంజనేయులు, వెంకటయ్య యాదవ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

వాయుదళానికి ఎంపికైన యువకుడికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని జంగారెడ్డిపల్లికి చెందిన నోమేశ్‌కుమార్ వాయుదళం ఫ్లైయింగ్ అధికారిగా ఎంపికయ్యారు. మంగళవారం భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, జంగారెడ్డిపల్లి సర్పంచ్ లింగారెడ్డితో పాటు పలువురు నోమేశ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేశ్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సైదులు రెడ్డి, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

కబ్రస్థాన్ స్థలం ఆక్రమణ.. ఫిర్యాదు!



ఈద్గా వద్ద కంచె నిర్మాణం చేపడుతున్న ముస్లింలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్లలో ముస్లిం కబ్రాస్థాన్(శ్మశానవాటిక)ను ఓ రైతు ఆక్రమించుకుంటున్నారని ముస్లింలు పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 565లో 20 కుంటల పొలాన్ని 60ఏళ్ల క్రితం కొనుగోలు చేసి ఈద్గాను నిర్మించుకున్నారు. అయితే ఈ స్థలాన్ని రైతు బాలచందర్ ఇటీవల పట్టా చేయించుకుని ముస్లిం శ్మశానవాటిక చుట్టూ ఉన్న కంచెను రాత్రి రైతు తొలగించారని ముస్లింలు జహంగీర్, ఖాజ, ఖదీర్, వహీద్‌లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కంచె నిర్మాణం చేపట్టకుండా అడ్డుకుంటున్న రైతుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేత

కల్వకుర్తిరూరల్: అంగన్‌వాడీలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే సమ్మెకు వెళ్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. మంగళవారం సీడీపీఓకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో మాసమ్మ, జయమ్మ, పుష్పలీల, స్వప్న, అలివేలు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

కొల్లాపూర్: పట్టణంలోని మహెబూబ్ ఫంక్షన్‌హాల్‌లో జై గౌడ సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వట్టికూర రామారావుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నారాయణగౌడ్, సుదర్శన్‌గౌడ్, సోమ ప్రగతి గౌడ్, తమటం వెంకటస్వామిగౌడ్‌లు హాజరయ్యారు. మండల కమిటీతో పాటు నియోజకవర్గ యూత్ కమిటీ, మహిళా కమిటీని ఎన్నుకున్నారు.

కమిటీ ఎన్నికకు ఆహ్వానం

మన్ననూర్: ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రాయలగండి చెన్నకేశవ స్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఆలయం ప్రాంగణంలో ఎన్నుకోవడం కోసం అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంగళవారం మన్ననూర్‌లోని అంబేద్కర్ కాలనీ వాసులను కలిసి ఆహ్వానం పత్రికలను అందజేశారు. రాయలగండి చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నాయని తెలిపారు.